ఎమ్మెల్సీ దువ్వాడకు డాక్టరేట్

డాక్టరేట్‌ను అందుకుంటున్న శ్రీనివాస్

టెక్కలి రూరల్: వైసిపి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని ఓ హోటల్ అమెరికన్ ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ సలహాదారుడు ఎం.ఆర్.మార్క్ బర్న్ గౌరవ డాక్టరేట్‌ను శనివారం అందజేశారు. వృత్తిపై అంకితభావం, సమాజంలో విశిష్ట సేవలను సేవలను గుర్తిస్తూ డేస్ప్రింగ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కార్యక్రమంలో ఇండో-ఇజ్రయల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆడమ్రాజ్ డెక్కపాటి, సొల్మన్ గట్టు, బిషప్ పోతన్, మాజీ ఎంపీ హర్షకుమార్, శ్రీను, అశోక్ గౌడ్, రాజయ్యగౌడ్, దివ్వెల మాధురి పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

గొట్టాబ్యారేజీని పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- హిరమండలం

జిల్లాకు గుండెకాయ వంటి వంశధార రిజర్వాయరు ప్రాజెక్టు పూర్తి చేసి చివర భూములకు సాగునీరు సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు వంశధార ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంశధార రిజర్వాయరుకు నీరు రావాలంటే నేరడి బ్యారేజీ నిర్మించాలన్నారు. లేకుంటే లిఫ్టుల ద్వారా రిజర్వాయరులో నీటిని నింపి రెండు పంటలకు సాగునీరు ఇవ్వాలన్నారు. దీంతో జిల్లాలో రెండు లక్షల 50 వేలు ఎకరాలకు గ్యారంటీగా నీరు అందించి సంవత్సరానికి జిల్లాకు రూ.2000 కోట్లు ఆదాయం వస్తుందని అన్నారు. దీనివల్ల ప్రజల ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రజలు కొనుగోలు శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని అన్నారు. కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. వలసలు నివారించవచ్చునన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం కాదని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం ద్వారానే సాధ్యమని అన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార జలాలను వినియోగించడం ద్వారా ప్రజల ఆదాయం రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే రిజర్వాయరు పూర్తి చేస్తే దానికి అయ్యే ఖర్చు ఏడాదిలోనే వస్తుందని, మరి ఎందుకు పూర్తి చేయడం లేదో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఎందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. జిల్లా వెనుకబాటుకు కారణం పాలకుల నిర్లక్ష్యమే అని వారు విమర్శించారు. వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా వంశధార ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ వేసి ఎందుకు అమలు చేయడం లేదని, కేంద్రంలోను, రాష్ట్రంలోను కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉందని వారన్నారు. 2005లో ప్రారంభించిన వంశధార రిజర్వాయరు, వంశధార, నాగావళి అనుసంధానం, ఆఫ్‌షోర్ రిజర్వాయరుకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో 20 ఏళ్లుగా పనులు పూర్తి కాలేదన్నారు. పాలకుల విధానాలు వల్ల జిల్లా వెనుకకు నెట్టబడుతుందని, ఆదాయం కోల్పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార రిజర్వాయరు 21 గ్రామాల ప్రజలు త్యాగాలతో నిర్మించారని అన్నారు. నీరు రాకపోవడంతో అదొక పెద్ద చెరువుగా నిరుపయోగంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు. వంశధార బ్యారేజీ నిర్మించి 50 ఏళ్లు పూర్తికావస్తుందని, ఆధునికీకరణకు రూ.1,500 కోట్లు అవసరమవుతుందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. కానీ కేంద్ర పభుత్వ సంస్థ నుంచి నిధులు ఎందుకు తేవడం లేదని కేంద్రమంత్రి కింజరాపు. రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. వంశధార బ్యారేజ్ ఆధునికీకరించకపోతే ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చని, అది జరిగితే జిల్లా 50 ఏళ్లు వెనక్కి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార నది జలాలను చివరి భూముల వరకు నీరు ఇవ్వాలని, వంశధార బ్యారేజ్ ఆధునికీకరణ చేయాలని డిమాండ్ చేశారు. వంశధార రిజర్వాయరు ద్వారా నారాయణపురం ఆనకట్టకు నీరు ఇవ్వడం, ఇచ్ఛాపురం వరకు నీరు ఇవ్వొచ్చని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని, ఏప్రిల్ 5న అన్ని ప్రజా సంఘాలు, పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోలాకి ప్రసాద్, సిర్ల ప్రసాద్, సూరయ్య, అప్పారావు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నియోజకవర్గంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి ఎన్‌టిఆర్ భవన్‌లో గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 497 గ్రామాలకు కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని హామీనిచ్చారు. అందులో భాగంగానే రూ.97 కోట్లు నిధులు ఉన్నాయని, త్వరితగతిన పనులు పూర్త చేయాలని సూచించారు. వాటి పనులు నిమిత్తం కాంట్రాక్టర్లకు టెండర్లకు పిలిచి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో తాగునీరు సరఫరా చేసే ట్యాంకులు ఉన్నాయని, వాటి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని మంత్రి కోరారు. దీనిపై అధికారులు 153 ట్యాంకులు ఉన్నాయని సమాధానం చెప్పారు. వాటికి మరమ్మత్తులు చేయాల్సి ఉంటే తక్షణమే చేయాలని సూచించారు. ప్రస్తుతం బాగానే ఉన్నాయని అధికారులు వివరించారు. వైసిపి ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పేరున పనులు చేపట్టారని, ప్రస్తుతం వాటి పరిస్థితిని ఏమిటని మంత్రి అధికారులను అడుగగా, బాగున్నాయని వివరించారు. గ్రామాల్లో అవసరం ఉన్నచోట తాగునీరు బోర్లు వేయాలని సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు బాషా, రామకృష్ణ అన్నారు. అనంతరం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలనుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

31న విద్యారంగ ఆర్థిక సమస్యలపై సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ విద్యారంగ ఆర్థిక సమస్యలపై ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సును నగరంలోని అంబేద్కర్ కళావేదికలో ఈనెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన 117 జిఒ వల్ల పాఠశాల విద్యా వ్యవస్థ విచ్ఛిన్నమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,512 ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడే పనిచేస్తున్నారని చెప్పారు. ఒకే మీడియం ప్రవేశపెట్టడం వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా జిఒ నంబరు 117 రద్దు చేస్తున్నామని చెప్తూ అదే సారాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. దీనివల్ల 1, 2 తరగతుల ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కనుమరుగవుతున్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు పూర్తయినా ఉపాధ్యాయ, ఉద్యోగుల 12వ పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ను ఇంతవరకు నియమించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్ల బకాయిలున్నా వాటిని చెల్లించకపోవడం అన్యాయమన్నారు. మరోవైపు డిఎలనూ చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచారన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ఆర్థిక అంశాలు తక్షణం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే డిమాండ్ తో నిర్వహించే సదస్సును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, గౌరవాధ్యక్షులు వైకుంఠరావు, సహాధ్యక్షులు దాలయ్య, కోశాధికారి రవికుమార్, కార్యదర్శులు హెచ్.అన్నాజీరావు, భాస్కరరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలకృష్ణ

మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

క్షయ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈనెల 24న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాలపై శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అని, ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సోకుతుందని, ముఖ్యంగా ఊపిరితిత్తులపై ప్రమాదం చూపుతుందని ఆయన వివరించారు. జిల్లాలో గతేడాది 3,854 క్షయ కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,428 కేసులు నమోదైనట్లు తెలిపారు. సకాలంలో క్షయకు చికిత్స పొందాలని, లేదంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుందని హెచ్చరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా ప్రభుత్వాస్పత్రిలోని టిబి కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. సకాలంలో చికిత్స చేసుకుంటే దీన్ని పూర్తిగా నివారించవచ్చన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం క్షయపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ చేసి, వ్యాధి నిర్మూలనకు సహకరించిన దాతలను సత్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ టి.శ్రీకాంత్, డిఐఒ రాందాస్, డిపిఎంఒ వాన సురేష్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ పరిరక్షణే ధ్యేయం

జెండాను ఎగురవేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిఎస్ఎన్ఎల్ పరిరక్షణ, ఉద్యోగులు, పెన్షనర్ల డిమాండ్ల సాధన లక్ష్యంతో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ పనిచేస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధరావు, పి.వెంకటరావు అన్నారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని యూనియన్ కార్యాలయ ఆవరణలో పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలు ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యానికి కారణమవుతున్నాయన్నారు. ఉద్యోగ, అధికారుల సంఘాల ఐక్య పోరాటాల్లో ముందుండి నడిపించడంలో యూనియన్ సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. సంస్థలో జాతీయ స్థాయిలో పదిసార్లు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తే, తొమ్మిదిసార్లు ఎంప్లాయీస్ యూనియన్ విజయాన్ని అందుకుందని గుర్తుచేశారు. సంస్థ పరిధిలో విఆర్ఎస్ పేరుతో బలవంతపు ఉద్యోగ విరమణలు ఆపాలని, తక్షణమే 4జి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బిఎస్ఎన్ఎల్ జెఇ రామానుజుడుకు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అభిమన్యు, డి.శ్రీనివాసరావు, పి.శారద, అరుణశ్రీ, ఎం.లక్ష్మి, సిహెచ్.లక్ష్మి, చరణ్, రమణ, హెచ్.ఢిల్లీశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

ఫారం పాండ్‌తో భూగర్భ జలాల అభివృద్ధి

గార: పల్లె పండగలో భాగంగా ఉపాధి హామీలో ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. తద్వారా నీటి ఎద్దడి నివారణకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. మండలంలోని అంపోలు పంచాయతీలో ఉపాధి హామీ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పథకం ద్వారా 30 వేల పనులు రూ.4,300 కోట్లతో జరిగాయని, అప్పట్లా కాకుండా నిధులు పక్కదారి పట్టకుండా పక్కాగా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి రైతుకు ఫారం పాండ్ కింద రూ.60 వేల నుంచి రూ.పది లక్షల వరకు పనులు చేయొచ్చని తెలిపారు. సిసి రోడ్లు, గోశాలలు, చెరువుల అభివృద్ధి పనులు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంటల కోసం నీటి వినియోగం కూడా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కూలీలకు తట్టి ఎత్తుతున్న ఎమ్మెల్యే శంకర్

పని దినాలపై అవగాహన కల్పించాలి

డ్వామా పీడీ సుధాకరరావు

మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి- కొత్తూరు

ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు వంద రోజుల పని దినాలపై ఫీల్డ్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నీరజ అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 14 ఏళ్లలో రూ.ఆరున్నర కోట్లు నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఇందులో సుమారు రూ. రెండు కోట్లు రికవరీ చేసినట్లు తెలిపారు రూ.లక్ష వరకు రికవరీపై కేసు నమోదు చేశామన్నారు. పనిప్రదేశం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. తప్పుడు మాస్టర్లు వేస్తే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 11 గంటలకు తిరిగి కూలీలు ఇంటికి చేరుకునే విధంగా చూసుకోవాలన్నారు. కూలీలకు ఇంకా రూ.55 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. సిబ్బంది ఎవరు పని వారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, స్వరూపరాణి, ఎపిడిలు శైలజ, రాధ, ఎపిఒ ప్రేమలత,. డిఆర్‌పిలు, ఎస్ఆర్‌పిలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బిసి రుణాల దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం : బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గెడ్డమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాపు కమ్యూనిటీకి చెందిన రుణాల మంజూరు కోసం దరఖాస్తుదారుల గరిష్ఠ వయోపరిమితిని 50 నుంచి 60 సంవత్సరాలకు పెంచినట్లు తెలిపారు.

పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం

మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు అన్నారు. రోడ్లను శుభ్రపరచడం ఒక్కటే కాదని, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడం తదితరమైనవి కార్మికుల విధుల్లో కీలకమన్నారు. నగరంలోని ఖాజీపేటలో చెత్త సంపద తయారీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పారిశుధ్య కార్మికుల అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్ కుమార్ మాట్లాడుతూ చెత్త సేకరణ సమయంలో తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చే విధంగా ప్రజలకు అలవాటు చేయాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను వేరు చేసి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, పర్యావరణ కార్యదర్శులు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల విన్నపాలు ఫలించేనా?

వీక్షణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శాసనసభా సమావేశాల ప్రశ్నోత్తరాలు, ఆ తర్వాత ప్రత్యేకంగా కొంతమంది ఉన్నతాధికారుల ను కలిసి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించడం స్వాగతించదగ్గ విషయమే. అసెంబ్లీకి వెళ్లి ఊరకనే కూర్చొని రాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడడం హర్షనీయం. అయితే వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతవరకు నెరవేరుస్తారన్నది ప్రశ్నార్థకమే. జిల్లాకు చంద్రబాబు ఇచ్చిన హామీలే నెరవేరని నేపథ్యంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలకు, వినతిపత్రాలకు ఏమేరకు ప్రాధాన్యం ఇస్తారో చూడాల్సిందే. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మెళియాపుట్టి మండలంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలంటూ ప్రశ్నోత్తరాల సమయంలో అడగడం మంచి విషయమే. 2022లో జిల్లాల పునర్విభజన తర్వాత సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోవడంతో శ్రీకాకుళంకు ఐటిడిఎ లేకుండా పోయింది. నాలుగైదేళ్లుగా గిరిజనులకు కష్టాలను తప్పడం లేదు. ఐటిడిఎకు సంబంధించి నిర్ణయాలు అమలు చేసే వ్యవస్థ పార్వతీపురం మన్యం జిల్లాలో ఉండటంతో ఇక్కడి గిరిజనులకు తలెత్తిన ఏ సమస్యనూ జిల్లా కలెక్టర్ పరిష్కరించే పరిస్థితి ఉండడం లేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోనే నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గిరిజన గ్రామాల్లో ఐటిడిఎ పిఒలు సందర్శిస్తున్నా, పెద్దగా ఫలితం కనిపించడం లేదు. ఇదే జిల్లాలో ఉన్న గిరిజన గ్రామాలను జిల్లా కలెక్టర్ సందర్శించినా గిరిజనుల వినతులను అక్కడకే పంపాల్సి ఉంటుంది తప్ప సొంతంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకపోవడంతో సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు ఎమ్మెల్యే గోవిందరావు ఈ సమస్యను ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లయింది. ఎన్నికల ప్రచారం కోసం పాతపట్నం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ఐటిడిఎ ఏర్పాటు చేస్తామంటూ ఇచ్చిన హామీని మరోసారి సిఎంకు గుర్తు చేసినట్లయింది. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా ప్రభుత్వపరంగా అటువంటి ప్రయత్నమేదీ జరిగినట్లు కనిపించలేదు. పరిశ్రమలకు ఆఘమేఘాల మీద భూములు కేటాయింపు, అనుమతులు జారీ చేస్తున్న ప్రభుత్వం గిరిజనుల విషయంలో మాటల్లో ఉన్న ప్రేమ చేతల్లో కనిపించడం లేదు.

జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం కోసం పలాస వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపైనా స్పష్టమైన హామీనిచ్చారు. జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామంటూ వాగ్దానం చేశారు. జీడి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారా?, ఇతర వాగ్దానాల మాదిరిగా చాప చుట్టేస్తారా? అన్నది చూడాల్సి ఉంది. జీడిపిక్కల కొనుగోలుపై గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేదు. జీడిపిక్కలను కొనుగోలు చేసే ఉద్దేశమే ఉంటే బడ్జెట్‌లో అందుకు సరిపడా నిధులను కేటాయించి, ఆ మేరకు ప్రస్తావించి ఉండేది. ఇప్పటికే జీడి పిక్కల కొనుగోలు సీజన్ మొదలవ్వడంతో గ్రామాల్లోకి దళారులు ప్రవేశించి తక్కువ రేటుకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

శ్రీకాకుళం నియోజకవర్గంలో వర్షాకాలంలో వరద ముంపు సమస్యలపై ఎమ్మెల్యే గొండు శంకర్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను కలిసి పి.జి పేట, కళింగపట్నం నాగావళి నది ప్రాంతంలో కరకట్టలు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కరకట్టల సమస్య ఉన్నా, తన నియోజకవర్గం మేరకు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం మంచి పరిణామమే. అయితే ఇది ఎంతవరకు నెరవేరుతుందనేది సందేహమే. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విపత్తులు సంభవించకుండా, వచ్చే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవడం వంటి విధులను మాత్రమే నిర్వర్తిస్తుంది. కరకట్టల విషయాన్ని ప్రభుత్వమే చూడాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వానికి సిఫార్సు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వానికి సిఫార్సు చేసినా బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా సాధ్యమయ్యే ఆస్కారం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కరకట్టల ప్రస్తావనే లేని విషయాన్ని చూశాం.

వంశధార ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలంటూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించడం ఇతర ఎమ్మెల్యేలెవరూ పట్టించుకోని ఓ సమస్యను లేవనెత్తడం హర్షించదగ్గ విషయమే. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా మారింది. ఎడమ కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టే అవకాశం ఉన్నా, బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంతో అంతకుమించి నీటిని వదిలిన సందర్భంలో గండి పడిన ఘటనలూ లేకపోలేదు. 2014-19 టిడిపి హయాం నుంచి ఎడమ కాలువ ఆధునికీకరణ పనులపై అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. పదేళ్లు గడుస్తున్నా ఆధునికీకరణకు నోచుకోని పరిస్థితిని చూస్తున్నాం. గత నెలలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల జాబితాలో వంశధార ఆధునికీకరణ పనులకు డబ్బులే కేటాయించలేదు. ఎమ్మెల్యే వినతిపత్రంతో పనులు జరుగుతాయంటే అది గొప్ప విజయమే అవుతుంది. ఎమ్మెల్యేల వరకు తమ పని తాము చేశారు. ఇక బాబు వారి మాటకు ఎంతమేర గౌరవిస్తారో వేచి చూడాల్సిందే!.

పనులను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రోడ్డు సుందరంగా కనిపించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జిల్లా ఆస్పత్రిలో కొత్తగా నిర్మాణం చేపట్టిన రోడ్డు సుందరంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతూ ఆహ్లాదకరంగా కనిపించేసినప్పుడే ఆస్పత్రి వాతావరణానికి వచ్చే రోగులకు సగం రోగం తగ్గిపోతుందన్నారు. ఆస్పత్రిలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావుకు సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా వైద్య సేవలు అందించాలన్నారు. వంశధార ఇఇ శేఖర్‌కు కొత్తగా నిర్మిస్తున్న రోడ్డుకు అడ్డంగా ఉన్న కార్యాలయానికి కొంతభాగం తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయకుమార్, హనుమంతు రామకృష్ణ, లాడి శ్రీనివాసరావు, మెండ దమయంతి, మట్ట సుందరమ్మ, కోల లవకుమార్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మామిడి రాము పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

'ఉపాధి'తో వలసల నివారణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉపాధి హామీ పనులతో వలసలను నివారించవచ్చునని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని చినవంక పంచాయతీ తాడివాడలో సర్పంచ్ దువ్వాడ హెంబాబు చౌదరి ఆధ్వర్యాన ఉపాధి హామీ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడిగిన ప్రతివారికీ పని కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూలీలకు కూలి గిట్టుబాటు వచ్చేలా మస్తర్లు వేయాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న కొద్దీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, టిడిపి జిల్లా కార్యదర్శి పోతనపల్లి సాంబమూర్తి, ఉపాధ్యక్షులు ఎ.ఉమామహేశ్వరరావు, రాపాక శాంతమూర్తి, ఆదినారాయణ, బగాతి రాజారావు, బుల్లోజు శశిభూషణరావు, దుర్యోధనరెడ్డి, ఎంపిడిఒ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

విద్యార్థులు భావితరాలకు వారధులు

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థులు భవిష్యత్ తరాలకు వారధులని, వారికి విలువలతో కూడిన విద్య అందించే ప్రయత్నం చేయాలని ముఖ్య అతిథి శమల్ల రాంబాబు, ప్రముఖ వక్త అర్జున్ పాత్రో అన్నారు. మండలంలోని జగతిలో పివిఆర్ విజ్ఞాన భారతి 45వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునికత పేరుతో విలువలు కోల్పోతున్న ప్రస్తుత పరిస్థితిలో విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత గురువులు, తల్లిదండ్రులదని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లల కదలికలపై నిఘా వేసి వారికి సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. భావి భారతావనికి నేటి బాలలే ఆధారమని, వారికి ప్రాథమిక దశలో సరైన బీజాలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పొందల జానకిరామయ్య, ప్రిన్సిపాల్ రమణమూర్తి, బి.నారాయణమూర్తి, పూడి వెంకటరమణ, భవాని, ధనలక్ష్మి, దివ్య, సరస్వతి, ముకుందరావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మండలం మలకాంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లపై అకృత్యాలకు పాల్పడినా, వేధింపులకు గురిచేసినట్లు నేరం నిరూపణమైతే పోక్సో చట్టం ప్రకారం శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు, వెట్టి చాకిరి చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జె.శ్రీనివాసరావు, న్యాయవాదులు మంజుల, రాము, సంతోష్, సతీష్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

కంచిలి: గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు అన్నారు. మండలంలోని ఎస్.ఆర్.సి.పురం కాలనీలో రూ.2.80 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కురయ్య, హరిబాబు, వెంకటేశ్వరరావు, సోమేష్, భాస్కరరావు, భోగేష్, చిరంజీవులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న రామారావు

స్థల ఆక్రమణకు యత్నం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని శివాలయం ముందు భాగంలో సర్వేనెంబర్ 135లో ఉన్న స్థలాన్ని ఓ కబ్జాదారుడు ఆక్రమణకు యత్నించడం కలకలం రేపింది. ఈ ఏడాది జనవరిలో కూడా స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తే అప్పట్లో స్థల యజమాని పల్లేటికుర్తి వెంకటరమణ జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణ దారుడు వెనక్కి తగ్గాడు. గత రెండు రోజులుగా పట్టణంలోని 18వ వార్డు బొడ్డేపల్లిపేటకు చెందిన భూ ఆక్రమణదారుడు స్థలం వద్దకు వచ్చి జెసిబి సహాయంతో అక్కడ ఉన్న పాత భవనాలను కూలగొట్టి ఆక్రమణకు యత్నించారు. దీంతో స్థల యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భూ ఆక్రమణదారుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

నకిలీ పత్రాలతో ఆక్రమణకు యత్నం

పట్టణానికి చెందిన రాజకీయ చోటా నాయకుడు నకిలీ పత్రాలతో భూ ఆక్రమణకు పాల్పడుతున్నాడని స్థల యజమాని పల్లేటికుర్తి వెంకటరమణ వాపోతున్నాడు. 2024లో రిజిస్ట్రేషన్ చేశారని ఆక్రమణదారుడు చెబుతున్నాడని అయితే తాను 2023లో స్థలాన్ని కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా తన వద్ద ఉన్నాయని వెంకటరమణ చెబుతూ విలపిస్తున్నాడు. స్థలం నుంచి తప్పుకోకుంటే హతమార్చడం తప్పదని బెదిరిస్తున్నాడని వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసు ఉన్నతాధికారులు అండదండలు తనకు ఉన్నాయని, తనను ఎవరు ఏమి చేయలేరని ఆక్రమణ దారుడు బెదిరిస్తున్నాడని బాధితుడు వాపోతున్నాడు. తన కష్టార్జితంతో స్థలాన్ని కొనుగోలు చేశానని దీనిపై న్యాయపోరాటం చేస్తానని బాధితుడు తెలిపాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలతో కూడిన డాకుమెంట్‌ను పోలీసు అధికారులకు తొందరలోనే అందజేస్తామని మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి తెలిపారు.

స్థల పత్రాలను చూపుతున్న వెంకటరమణ

జెసిబితో చదును చేస్తున్న స్థలం

భూ ఆక్రమణదారునిపై పలు ఆరోపణలు

భూ ఆక్రమణదారునిపై గతంలో కూడా పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో వన్ వే జంక్షన్ వద్ద ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఓ షాపు విషయంలో వదిన, మరిది తగాదా పడుతున్న విషయాన్ని తెలుసుకొని వదినతో రిజిస్ట్రేషన్ చేయించుకొని షాపును ఛేజిక్కించుకున్నాడని పలువురు చెబుతున్నారు.

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బోరుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ బస్సు షెడ్ వద్ద నిరుపయోగంగా ఉన్న బోర్‌వెల్‌ను శనివారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 7న 'నిరుపయోగంగా బోరు' అనే కథనం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైంది. ఈ కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. బోరు మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బమ్మిడి పున్నయ్య పాల్గొన్నారు.

అప్పటి కథనాలను చూపిస్తున్న ఎమ్మెల్యే శిరీష

తప్పుడు కథనాలపై జరిమానా

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు తన ఆధీనంలో ఉన్న పత్రికల ద్వారా తనపై, తన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత కక్షతో తప్పుడు వార్తలు రాయిస్తూ... మానసికంగా వేధించినట్లు గుర్తించి కోర్టు ఆ పత్రికకు రూ.2 లక్షలు జరిమానా విధించిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తనపై నిందలు మోపి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసిన ప్రజాగళం మనచిక్కోలు పత్రిక యజమాని సిహెచ్.జగదీశ్వరరావుకు విశాఖపట్నం కోర్టు రూ.2 లక్షలు జరిమానా విధించిందన్నారు. పత్రికా విలువలు కాలరాసి నోటికి వచ్చిన విధంగా అబద్ధాలు సృష్టించి వార్తలు రాశారని, దీనివల్ల తాను మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధానికి సైతం ప్రశ్నలు వేసే హక్కు పత్రికలకు ఉన్నాయని, అయితే లేనిపోని కల్పిత కథలు రాయడం భావ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఇటువంటి వార్తలు రాసినప్పుడు న్యాయస్థానాలు ఎన్నడూ ఉంటాయన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని, నిర్భయంగా కోర్టుకు ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందని రుజువైందని అన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

సాహిత్య సాంస్కృతిక సమాఖ్య మండలశాఖ ఆధ్వర్యాన ఆదివారం లోకభాందవ శతక గ్రంథావిష్కరణ చేపడుతున్న సమాఖ్య ప్రధాన కార్యదర్శి బొడ్డ అయ్యాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి గ్రంథ రచయిత అష్టావధాని పైడి హరనాథరావు పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రూ.పది కోట్లతో అభివృద్ధి పనులు

జెఇ మణికంఠను నిలదీస్తున్న తాళ్లవలస ఉప సర్పంచ్ తిరుపతిరావు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయని, పనులు జరుగుతున్నాయని పిఆర్ ఎఇ శ్రీవల్లి అన్నారు. శనివారం లావేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఎఇ శ్రీవల్లి మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే రూ.6 కోట్లు బిల్లులు చెల్లించడం జరిగిందని చెప్పారు. విద్యుత్ శాఖ ఎఇ అప్పన్న మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో కొత్తగా బోరు బావులు వేసేందుకు నిషేధించడమైందని, వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సర్వీస్ కనెక్షన్ మంజూరుకు తహశీల్దార్ ధ్రువీకరించిన ఫారం-3 అవసరమన్నారు. అదపాక, గుర్రాలపాళెం ఎంపిటిసిలు గంట్యాడ సత్యం, జనపాల బానోజీరావులు మాట్లాడుతూ తమ గ్రామాలను రెడ్‌జోన్ జాబితా నుంచి తొలగించాలని, బోర్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, వ్యవసాయం చేసుకొనేందుకు నీరులేక ఇబ్బందులు పడుతున్నామని సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయధికారి మహేష్ నాయుడు మాట్లాడుతూ మండలంలో ఫార్మా రిజిస్ట్రేషన్ 12 వందల మందికి ఇప్పటివరకు చేయడం జరిగిందని చెప్పడంతో పలువురు సభ్యులు మూకుమ్మడిగా గ్రామాల్లో వ్యవసాయధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఎఒని నిలదీశారు. అలాగే గ్రామీణాభివృద్ధి నీటి సరఫరా శాఖ జెఇ మణికంఠ మండలంలో అందుబాటులో లేరని ఫోన్లు చేసిన స్పందించడం లేదని పలువురు సర్పంచ్‌లు మండి పడ్డారు. సమావేశంలో జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, డిటి తిరుపతిరావు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా 'ఉల్లాస్' పరీక్షలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఉల్లాస్ పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ వసంత్ కుమార్ అన్నారు. పలాస వెలుగు కార్యాలయంలో శనివారం వెలుగు సిఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉల్లాస్ పరీక్షలు రాసేందుకు 1091 మంది ఉన్నారని అన్నారు. 109 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. వెలుగు ఎపిఎం జాంబవతి, ఎంఎంఎస్ కోశాధికారి త్రివేణి, కళ్యాణి పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

మెళియాపుట్టి : ఈ నెల 23న అన్ని పంచాయతీ, అంగన్వాడీ కేంద్రాల్లో వంద రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న నిరక్షరాసులకు ఆదివారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు నిర్వహించేందుకు సిసిలకు శనివారం పరీక్ష మెటీరియల్‌ను ఎంపిడిఒ నరసింహప్రసాద్‌పండా మాట్లాడుతూ పరీక్షలు సక్రమంగా నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం త్రినాథమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : మాట్లాడుతున్న ఎపిఎం లలిత

కొత్తూరు : ఉల్లాసం పరీక్షలపై వెలుగు కార్యాలయంలో ఎపిఎం లలిత విఒఎలకు అవగాహన కల్పించారు. మండలంలోని 43 పంచాయతీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రాన్ని విఒఎలు పర్యవేక్షించాలన్నారు. ఈ పరీక్షకు 974 మంది విఒఎలు, 98 వాలంటీర్లు బాధ్యత వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిసిలు కేశవ, ప్రమీల, జయతి, పుష్ప, మిన్నారావు, గోవిందరావు పాల్గొన్నారు.

'ఇంటికి దారి లేకుండా చేస్తున్నారు'

పోలాకి: 'తాతలు తండ్రులు నుంచి శాశ్వత నివాసాలు నిర్మించుకుని నివశిస్తున్నాం. బతుకు తెరువు కోసం ఆరు నెలలు వలస వెళ్లి వచ్చాం. మా ఇంటికి దారి లేకుండా ఆక్రమించి అడ్డుగా గోడ కట్టేస్తున్నారు' అని మునుసుబపేటకు చెందిన అమలాపురం రామారావు దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి. రవికుమార్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ దంపతులు మాట్లాడుతూ మా స్వగ్రామంలో మా సొంత స్థలంలో డోర్ నంబర్ 8-145లో డాబా ఇల్లు నిర్మించికున్నామన్నారు. మా ఇంటికి రహదారి ఉండేదన్నారు. ఆ తోవ గుండా రాకపోకలు చేసేవాళ్లమని పేర్కొన్నారు. అయితే ఇటీవల జీవనోపాధి నిమిత్తం కుటుంబతో హైదరాబాద్ వెళ్లామన్నారు. తిరిగి వచ్చి చూస్తే డోల శ్రీరాములు, శివ్వాల గోవింద రోడ్డుని ఆక్రమించి పూర్తిగా రాకపోకలు నిలిపివేశారన్నారు. మా ఇంటికి వెళ్లడానికి తోవలేకుండా చేశారన్నారు. అడిగే మా పై తిరుగుబాటు చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

వినతిపత్రం అందజేస్తున్న రామారావు

బెట్టింగ్‌తో జీవితాలు నాశనం

పలాస: బెట్టింగ్ ద్వారా ఎంతో మంది యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మరికొంత మంది అప్పులపాలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. గ్రీన్ ఆర్మీ పలాస వాసి పేస్ ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి శ్రీనివాస లాడ్జి కూడలి వరకు బెట్టింగ్ యాప్‌పై విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీనివాస లాడ్జి జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా బెట్టింగ్ నిర్వహించి పాల్గొన్నట్లయితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. యువత విలువైన సమయాన్ని కోల్పోయి బెట్టింగ్స్ వల్ల బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారన్నారు. కోవిడ్ తర్వాత ఈజీ మనీ, ఇన్స్టంట్ మనీకి అలవాటు పడిన యువత కష్టపడకుండా డబ్బులు సంపాదించడం అనుకొని నేరాల బాట పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, సిపిఐ నాయకులు వేణుగోపాల్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్, పవనపుత్ర సేవాసమితి ఫాల్గుణరావు, దిలీప్, తామాడ దాలమ్మ, ఆర్‌టిసి ఎంప్లాయాస్ యూనియన్ నాయకులు మెట్ట సూర్యనారాయణ, పైల జవహర్ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్, పలాస యూత్ అసోసియేషన్ పాల్గొన్నారు.

మానవహారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు

నీటి పొదుపు తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న వెంకట్ ఉజ్వల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలవనరులను సంరక్షించు కోవడం అందరి బాధ్యతని, నీటి వినియోగంలో పొదుపు పాటించడం తప్పనిసరని సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు సూచించారు. నగరంలోని గాయత్రి ఐటిఐ సమావేశ మందిరంలో శనివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎఇ డి హేమలత అధ్యక్షత వహించారు. సెట్‌శ్రీ, నెహ్రూ యువక కేంద్రం, లైఫ్ ఫ్యూయల్ సర్వీసు ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. భావితరాలకు పరిశుభ్రమైన తాగునీరు అందాలంటే ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భంలోకి పంపించడం అవసరమన్నారు. మంచినీటి వనరులను రక్షించడానికి, పర్యావరణ వ్యవస్థలను రక్షించడానికి తక్షణ చర్య అవసరమన్నారు. పరిశుభ్రమైన తాగునీరు లేక అంతర్జాతీయ లెక్కల ప్రకారం ఏటా 14 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పరిశుభ్రమైన నీరులేక అనేక ప్రాంతాల్లో ప్రజలు రోగల బారిన పడుతున్నారన్నారు. నెహ్రూ యువక కేంద్రం డిడి వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ డిసెంబర్ 22, 1992న, ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మార్చి 22న ప్రపంచ జల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో గాయత్రి ఐటిఐ ప్రిన్సిపాల్ వి.రవికుమార్ మాట్లాడుతూ సురక్షితమైన నీరు అందుబాటులో లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నారాయణపురం సాగునీటి ప్రాజెక్టు వైస్ చైర్మన్ పంచిరెడ్డి కృష్ణారావు, లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీధర్, పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు, సెట్‌శ్రీ మేనేజర్ వి.వి. అప్పలనాయుడు, సూపరింటెండెంట్ ఎల్.రేఖ, ఎన్‌వైకె ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, ఆరుగుల దిలీప్ కుమార్, గుండ వసంత లక్ష్మి, లైఫ్ ఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ అచ్యుతరావు, జాయింట్ సెక్రెటరీ ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ప్రపంచ జల దినోత్సవాన్ని బుడుమూరు ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు నీటి బిందువు ఆకారంలో కూర్చుని నీటి ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాదరావు, ఎం.అనురాధ, కె.వెంకటరావు, కె.చిన పెంటయ్య, ఎస్. రమేష్‌బాబు, కె.చంద్రశేఖర్, ఎల్.రమణమ్మ పాల్గొన్నారు.

పొందూరు: ప్రతిఒక్కరూ నీటి ఆవశ్యకతను గుర్తించి భావితరాలకు సరిపడా నీటిని అందజేయాల్సిన అవసరం ఉందని హెచ్‌ఎం గురుగుబెల్లి మధుబాబు అన్నారు. మండలం గూనానపేట ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నీటిబొట్టు ఆకృతిలో కూర్చొని నీటి ఆవశ్యకతను తెలియజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: అడుగంటిపోతున్న భూగర్భ జలాలను పరిరక్షిస్తూనే ప్రతి నీటిబొట్టును ఒడిసి పడదామని భవిష్యత్ అవసరాలకు పదిలంగా దాచుకుందామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కమ్మసిగాడాం పంచాయతీ యాగాటిపాలెంలో ఇంకుడు గుంతలు తవ్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, కూటమి నాయకులు లెంక శ్యాం, మన్నె లక్ష్మి ప్రసాద్, పిసిని హరికృష్ణ, గొర్లె సాయి, జీరు గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

టెక్కలి : ప్రపంచ జలవనరుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక అమ్మఒడి పాఠశాల విద్యార్థులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పాఠశాల కరస్పాండెంట్ బరాటం శ్రీనివాసరావు ప్రారంభించారు. పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ పుర వీధుల్లో సాగింది. నీటిపై అవగాహన తెలియజేస్తూ... విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేపట్టారు. కరస్పాండెంట్ బరాటం శ్రీనివాసరావు, హెచ్‌ఎం దామోదరరావు, పుష్పలత, రవికుమార్, బాలాజీ, కృష్ణారావు, రాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జెసిఐ సభ్యులు నీటి సంరక్షణ అవసరాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. 'సేవ్ వాటర్, సేవ్ లైఫ్' అనే సందేశంతో స్టిక్కర్లను రైల్వేస్టేషన్, పాఠశాలలు, హోటళ్లు, ఆలయాలు, అన్న క్యాంటీన్ల గోడలపై అంటించారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షులు కాళ్ల జైదేవ్, స్వరూప్, పవన్, దిలేష్, సంతోష్ పాల్గొన్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో ఇద్దరు అరెస్టు

పలాస: పలాస రైల్వే స్టేషన్ వద్ద ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరికి చెందిన గుల్సన్ ఆనంద్, అదే ప్రాంతానికి చెందిన మోజేష్ కుమార్ పాణి 7.8 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నామని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఐ పి.సూర్యనారాయణ తన సిబ్బందితో తనిఖీలు చేపడుతున్నారని అన్నారు. నిందితులు క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్నారన్నారు. ఏదో విధంగా డబ్బులు సంపాదించి బెట్టింగ్‌లో కోల్పోయిన నగదు రికవరీ చేసుకోవాలని ఆలోచించి గంజాయి రవాణాను ఎంచుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన బాయ్యుంట అనే వ్యక్తి పరిచయమయ్యాడని అన్నారు. తాను గంజాయిని చెన్నై, బెంగుళూరుకు తరలిస్తానని, తనకు సహాయం చేస్తే నగదు ఇస్తామ నడంతో ఇద్దరూ దీనికి అంగీకరించారని అన్నారు. 7.8 కిలోల గంజాయిని పలాస రైల్వే స్టేషన్ వద్ద శక్తి అనే వ్యక్తికి ఇచ్చేందుకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారని అన్నారు. మొత్తం నలుగురిపై కేసులు నమోదు చేయగా, గంజాయి తరలిస్తున్న ఇద్దరు పట్టుబడ్డారని అన్నారు. మిగిలిన వారికోసం గాలిస్తున్నామని తెలిపారు.

సారా ప్యాకెట్లను సీజ్ చేసిన పోలీసులు

నాటుసారా ప్యాకెట్లు స్వాధీనం

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి అక్రమంగా స్కూటీ డిక్కీలో నాటుసారా ప్యాకెట్లు రవాణా చేస్తుండగా, ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. శంభు శంకరరెడ్డి తన స్కూటీ డిక్కీలో 25 నాటుసారా ప్యాకెట్లు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన సిబ్బంది తనిఖీ చేశారు. డిక్కీలోని సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేశారు. అదేవిధంగా ఈదుపురంలోని నవోదయం2లో భాగంగా నాటుసారా వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. నాటు సారా తయారు చేసినా, రవాణా చేసినా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐ వి.రమ; సూర్యారావు, సింహాచలం, గ్రామ దత్తత అధికారి కాంతారావు, సర్పంచ్ వరప్రసాద్, కార్యదర్శి, ఫారెస్టు బీటు అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న ఆర్‌టిసి బస్సు

బస్సును ఢీకొన్న లారీ

లావేరు: మండలంలోని జాతీయ రహదారి తాళ్లవలస గ్రామం వద్ద హనుమాన్ ఆలయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌టిసి బస్సు నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లావేరు పోలీసుల కథనం మేరకు శ్రీకాకుళం ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు సర్వీసింగ్ నిమిత్తం విశాఖపట్నం వెళ్లేందుకు డ్రైవర్ ఒక్కడే బస్సును నడుపుకుంటూ వెళ్తుండగా తాళ్లవలస సమీపంలో డ్రైవర్ బస్సును నిలుపుదల చేసి కిందకు దిగి ఉండగా ఇంతలో అదే రహదారి గుండా వెనుకనుంచి వస్తున్న లారీ బ్రేక్ ఫెయిలై బస్సును బలంగా ఢీకొని 100 మీటర్లు మేర బస్సును లారీ ఈడ్చుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంతో రహదారిపై కిలోమీటరు మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడిందన్నారు. ఆర్‌టిసి అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

తెరవేకు పుస్తకాలు వితరణ

గుజరాతీపేట: ఏలూరు జిల్లా భీమడోలులోని సత్యం ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ స్థానిక తెలుగు రచయితల వేదిక(తెరవే)కు వెన్నెల వెలుగులు అనే టైటిల్‌తో కూడిన 61 పుస్తకాలను ఉపంపారు. తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి. రమణమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యం ఫౌండేషన్ వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ బాలనాగు సుబ్రహ్మణ్య ప్రసాద్ రాసిన ఈ విశిష్ట పుస్తకాలను అతని కుమారులు విజయసారథి, శ్రీధర్ విజయకష్ణ బాధ్యత తీసుకుని పంపారని తెలిపారు. సాహిత్య రంగంలో తెలుగు రచయితల వేదిక చేస్తున్న విశిష్ట సేవలకు, కార్యక్రమాలకు స్పందించి సత్యం ఫౌండేషన్ పుస్తకాలను అందించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులకు తెరవే ప్రతినిధులు కతజ్ఞతలు తెలిపారు.

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పంట సంజీవనితో రైతులకు మేలు

ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పంట సంజీవిని పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని దీర్ఘాశిలో శనివారం నిర్వహించిన పంట సంజీవని కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో కేవలం ఒక సెంటు విస్తీర్ణంలో దీనిని నిర్మించుకుంటే వర్షపు నీటిని ఎక్కడి నిల్వ చేయవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఈ గట్టుపైన రాబడి వచ్చే ఉద్యానవన పంటలను వేసుకున్నట్లయితే మరింత ఆదాయం లభిస్తుందని వివరించారు. ఈ పంట సంజీవని ద్వారా వేసవిలో కూడా వ్యవసాయం చేసుకుని ఎందుకు నీరు సమృద్ధిగా ఉంటుందని, వీటిని అభివృద్ధి చేసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియపల్లి వెంకటప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఖైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, ఎంపిడిఒ జి.రవికుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులు వివిధ రంగాల్లో పోటీని తట్టుకుని ఉపాధి అవకాశాలు దక్కించు కునేందుకు నైపుణ్యాభివృద్ధిని సాధించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్య చంద్రరావు అన్నారు. శనివారం కళాశాలలో జవహర్ నాలెడ్జి సెంటరు, ఎపి ఐటి అకాడమీ, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం సంయుక్తంగా ఎంప్లాయ్ ఎబిలిటీ స్కిల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో నాంధి ఫౌండేషన్ ఆధ్వర్యాన మహేంద్ర ప్రైడ్‌క్లాస్ ప్రోగ్రాం అధికారి ఎస్.అయేషా షేక్ శిక్షకులుగా వ్యవహరించారు. 53 మంది విద్యార్థులు ఈశిక్షణలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ మెళుకులవలను నేర్చుకునేందుకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు బాడి లాంగ్వేజ్, పర్సనల్ గ్రూమింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ పద్మావతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి. జెకెసి కో-ఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, ఎస్.మాధవీలత, వి.శైలజ, ఎస్.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గుజరాతీపేట: నగరంలోని గుజరాతీపేట-1, గుజరాతిపేట-2 రేషన్ డిపోలను స్థానిక టిడిపి నాయకులు అందవరపు సంతోష్ స్థానిక నాయకుల తో కలిసి సందర్శించారు. డిపోల్లో జరుగుతున్న ఇకెవైసి కార్యక్రమాన్ని పరిశీలించారు. సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి కరగణ భాస్కరరావు, విఆర్‌ఒ ఉమామహేశ్వరరావు, ఎండియు ఆపరేటర్ల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, డీలర్లు రామకృష్ణ, ప్రసాద్, తరుణ్, అభిషేక్, డివిజన్ మహిళా కార్యకర్తలు తదితరులున్నారు.

అనుభవం ఒకరిది.. 1బి ఇంకొకరిది

ప్రజాశక్తి- కవిటి

రెవెన్యూ వ్యవస్థలో చోటుచేసుకున్న తప్పిదాల వల్ల 1బి, మ్యుటేషన్ అవసరమైనప్పుడు రైతులకు పలు సమస్యలు ఎదురవుతున్నాయని, వారసత్వంగా వస్తున్న, కొనుగోలు చేసుకున్నా కానీ భూమి ప్రస్తుతం ఒకరి అనుభవంలో ఉంటే 1బిలో వేరొకరి పేరుతో చూపిస్తోందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని డి.జి.పుట్టుగ ఎంపిటిసి చందాన పూర్ణచంద్రరావు తహశీల్దార్ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కడియాల పద్మ అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఒకరి భూమి వేరొకరికి పడిపోవడం వల్ల బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు, అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కొంతమందికి 50 సెంట్లు ఉంటే 1బిలో 10 సెంట్లు మాత్రమే చూపిస్తోందని, మరి కొంతమందికి సున్నా విస్తీర్ణం చూపిస్తోందని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులకు రీ షెడ్యూల్ చేయాలన్నా, మార్ట్ గేజ్ లోన్ కావాలన్నా తిప్పలు తప్పడం లేదని అన్నారు. దీనిని సరిచేయాల్సిన రెవెన్యూ సిబ్బంది అవతల వ్యక్తి అనుమతితోనే మళ్లీ అది సరి చేయాలని దానికి అతని అనుమతి అవసరమని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ వెబ్ ల్యాండ్‌లో జరిగిన కొన్ని తప్పిదాల వల్ల రీ సర్వేలో తప్పులు జరిగాయని తెలిపారు. సున్నా విస్తీర్ణం ఉన్న రైతుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. బెజ్జిపుట్టుగ సర్పంచ్ నారాయణస్వామి మాట్లాడుతూ డయాలసిస్ రోగులకు గత ప్రభుత్వంలో 108 వాహనం ద్వారా ఆస్పత్రి వరకు రవాణా సదుపాయం ఉండేదని, ప్రస్తుతం దాన్ని నిలిపివేయడంతో డయాలసిస్ రోగులు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీంతో మారుమూల ప్రాంతాల నుంచి కవిటి, సోంపేట వెళ్లే రోగులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దేవరాజ్ సాహు మాట్లాడుతూ మండలంలోని పిహెచ్‌సిల్లో కిడ్నీ రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేవని అన్నారు. దీనిపై వైద్య సిబ్బంది బెందాళం శివప్రసాద్ మాట్లాడుతూ కరోనా సమయం నుంచి డయాలసిస్ రోగులకు 108 ద్వారా రవాణా సదుపాయం అందిస్తున్నామని అన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల దానికి బ్రేక్ పడిందని, మళ్లీ వారితో మాట్లాడితే డయాలసిస్ రోగులలకు రవాణా సదుపాయం కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ మాట్లాడుతూ బెంతు ఒరియాలకు సాంకేతిక కారణాల వల్ల హౌసింగ్ లోన్ సదుపాయం కల్పించలేకపోతున్నామని, దీనివల్ల స్థానికంగా సమస్య ఎదురవుతున్నట్టు తెలిపారు. సమావేశానికి గౌరవ అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలని, అధికారులైన - ప్రజా ప్రతినిధులైనా ప్రజా సేవకే ఉన్నారని హితవు పలికారు. ఈ సమావేశానికి పశు సంవర్ధకశాఖ, ఎక్సైజ్ శాఖలు గైర్హాజరయ్యాయి కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ ధనుంజయ మజ్జి, మండల ఇంజినీర్ ప్రవీణ్‌కుమార్, ఆర్అండ్‌బి జెఇ విక్రమ్, మండల ఉద్యానశాఖ అధికారి పోలాకి మాధవీలత పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు చర్చిస్తున్న ఎంపిటిసి పూర్ణచంద్రరావు

తీర్మాన కాపీని అందజేస్తున్న వైసిపి నాయకులు

వైసిపి సభ్యులు బహిష్కరణ

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సమావేశాన్ని స్థానిక వైసిపి సభ్యులు బహిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుంచి స్థానిక సంస్థలైన పంచాయతీ అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేయకుండా, సహకరించని మండల పంచాయతీరాజ్, ఇతర అధికారుల తీరుకు నిరసన వ్యక్తం చేశారు. ఎంపిటిసి గౌరవ వేతనం చెల్లించని కారణంగా మండల సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదించారు. ఈ తీర్మాన కాపీని ఎంపిడిఒ కప్పిలి ఫణీంద్రకుమార్‌కు, మండల విప్ బొద్దు అప్పన్నకు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామకృష్ణలకు అందజేశారు. ప్రజలతో ఎన్నుకున్న నాయకులను కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం విగ్రహాలలో మార్పించరని దుయ్యబట్టారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, దీనికి సమాధానం ఎవరు చెప్తారని ప్రశ్నిస్తూ బయటకి వెళ్లిపోయారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఐక్యమత్యంగా ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే గౌతు శిరీష్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు మోహనరావు అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ మేరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. జీడి మద్దతు ధరపై అసెంబ్లీలో రెండుసార్లు ప్రస్తావించానని, వచ్చేనెల కేంద్రమంత్రికి జీడిమద్దతు ధరపై కలుస్తున్నట్లు చెప్పారు. రూ.70 కోట్లతో నియోజకవర్గంలో ఉపాధి హామీ నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించుకున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, మండల ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరం ావు, కర్ని రమణ, కో-ఆప్షన్ మాజీ సభ్యులు నెయ్యిల సూర్యనారాయణ, పాపారావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

మందస : నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలం బాలిగాం ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ మేరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీలు

నామమాత్రంగా సామాజిక తనిఖీ చేస్తున్న డిఆర్‌పి బృందం

లావేరు : మండలంలోని జాతీయ ఉపాధిహామీ పథకంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకుగాను గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు చేసిన పనులను తనిఖీ చేసి కొలతలు తీసుకుని కూలీల ఇంటింటికి వెళ్లి ఎన్ని రోజులు పనికి వెళ్లారు. ఎంత వేతనం వచ్చిందనే తదితర విషయాలను కూలీలను అడిగి వివరాలు నమోదు చేసుకొని గ్రామసభలో ఆ వివరాలును చదివి వినిపించాలి. అనంతరం మండల ప్రజావేదిక ఉంటుంది ఇది ఉపాధిహామీ పథకం నియమ నిబంధన. అయితే ఇక్కడ దానికి వ్యతిరేకంగా జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. లావేరు పంచాయతీలో మాత్రం ఉపాధి నియమ నింబంధనులకు వ్యతిరేకంగా సామాజిక తనిఖీలను ఆ బృందాలు చేస్తున్నాయి. డిఆర్‌పి బృందాలు గ్రామాల్లో పనిచేసిన ప్రదేశం, వేతనదారుని ఇంటికి వెళ్లకుండా నామమాత్రంగా గ్రామంలో రెండు చోట్ల కూర్చుని కొంతమంది మేట్లు ద్వారా మరికొందరు కూలీలతో కుమ్మక్కై నామమాత్రంగా వివరాలు తీసుకొని తూతూ మంత్రంగా తనిఖీ చేస్తున్నారు. లావేటిపాళెం గ్రామంలో తనిఖీ బృందాలు ఇంటింటికి వెళ్లకుండా కిరాణా దుకాణం వద్ద కూర్చుని తనిఖీ బృందాలు వివరాలు నమోదు చేస్తే పనిలో, బిల్లులు చెల్లింపులో అసలు నిజాలు ఎలా తెలుస్తాయని, సామాజిక తనిఖీ ఆశయం ఎలా నెరవేరుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

'పది' పరీక్షలపై ప్రత్యేక నిఘా

టెక్కలి: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యాశాఖాధికారులు నిఘా పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఎచ్చెర్ల మండలం కుప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డిబార్, 15 మంది ఇన్విజిలేటర్లను సస్పెన్షన్ వంటి ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలపై ఆ ప్రభావం పడుతుంది. ఇందులో భాగంగా టెక్కలి పట్టణంలోని ఆరు పరీక్షా కేంద్రాలపై నిఘా పెట్టారు. ఇప్పటికే పట్టణంలోని ఒక పరీక్షా కేంద్రంపై పలు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై దృష్టిసారించినట్లు సమాచారం. ఇప్పటికే లాగ్వెంజ్ పరీక్షలు పూర్తయి సోమవారం నుంచి గ్రూప్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీటిని పరీక్షలు కఠినతరంగా నిర్వహించనున్నారు. కాగా, విద్యాశాఖలో ఉన్న పలు రకాల పాఠశాలలకు చెందిన యాజమాన్యాలు ఎక్కువ శాతం మార్కులు సాధించడానికి మాస్‌కాపీయింగ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా తమ విద్యార్థులు పరీక్షలు రాసే కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పనకు వెనుకాడడం లేదన్నది సమాచారం. జిల్లాలో కుప్పిలి పాఠశాల ఘటన విద్యాశాఖ ఆధికారులకే తలవంపుగా మారడంతో మిగిలిన కేంద్రాల్లో కూడా కఠినతరంగా పరీక్షలు నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఏదేమైనా సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించినట్టు తెలుస్తోంది.

చలివేంద్రం ప్రారంభం

బూర్జ: మండలంలో డొంకలపర్త పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్‌పిటిసి డి.రామారావు హాజరై మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ప్రయాణికులకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కృష్ణ, కె.మురళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మస్తానయ్య

పరీక్షా కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-పలాస

పలాస, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి సంస్కృతం పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు వి.ఎన్.మస్తానయ్య శనివారం పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, ఎంత మంది హాజరయ్యారు? పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయా? లేవా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో ఎటువంటి చూసిరాతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో పాటు ఆయన భోజనం చేసి సంతృప్తి చెందారు. ఆయనతో పాటు సోంపేట, పలాస ఎంఇఒ-2 కృష్ణంరాజు, చెరుకుపల్లి సత్యం, పలాస, కాశీబుగ్గ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, వై.చిన్నంనాయుడు, తారక రామారావు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ మురళీమోహన్

దళితుల హక్కుల పరిరక్షణకు చర్యలు

కవిటి: దళిత హక్కులకు భంగం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మురళీమోహన్ హెచ్చరించారు. మండలంలోని జగతిలో సివిల్ రైట్స్ డే సందర్భంగా శనివారం మానవ హక్కులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం కల్పించిన భూములను ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చేస్తాం చేస్తామన్నారు. దళిత గ్రామాల్లో ఎనిమిది నుంచి పీజీ చదివే విద్యార్థులకు వసతి సదుపాయం అవసరమైతే తమ దృష్టికి తీసుకువస్తే వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. సర్పంచ్ పూడి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రవివర్మ, పూడి ప్రవీణ్, దళిత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోక్సో చట్టంపై అవగాహన

సోంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల నుంచి పిల్లల సంరక్షణ చట్టం గురించి తెలియజేశారు. 18 ఏళ్లలోపు పిల్లలపై ఎవరైనా లైంగికదాడులకు పాల్పడితే వారిపై కఠినమైన శిక్ష ఉన్నాయన్నారు. 12 ఏళ్లకు పైబడి శిక్ష ఉంటుందని, ఒక్కోసారి ఉరిశిక్ష కూడా అమలవుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సిహెచ్.ఈశ్వరమ్మ, జి.సైలేందర్, వెలుగు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

సోంపేట : బారువ మెరైన్ పోలీసుల ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. సిఐ రమేష్‌కుమార్ దీనిని ప్రారంభించగా, స్థానిక మత్స్యకార గ్రామాల నుంచి యువకులు అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 63 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాస్, శిరీష, వైద్యాధికారి బి.సునీత, సిబ్బంది పాల్గొని సేవలందించారు. అనంతరం సిఐ ప్రశంసాపత్రాలను అందజేశారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పలాస : చెత్త సంపద కేంద్ర నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, అందుకు సచివాలయం ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపిడిఒ వసంత కుమార్, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంతరావు అన్నారు. మండలంలోని తర్లకోట చెత్త సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీకంపోస్టు ఎరువుగా తయారు చేయాలన్నారు. తయారు చేసిన వర్మీకంపోస్టు ఎరువును విక్రయించి వాటి ద్వారా ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలన్నారు. ముందుగా లొద్దభద్ర సచివాలయం ఆవచణలో పి4 సర్వేపై గ్రామసభ నిర్వహించారు. సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శులు లండ శ్రీధర్, సుధాకర్, టిడిపి నాయకులు వంకల కూర్మారావు, కామరాజు పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం

పలాస : 2019 నుంచి 2024 మధ్య కాలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుతుందని వెలుగు ఎపిఎం జాంబవతి, హౌసింగ్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం హౌసింగ్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసి, ఎసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందజేస్తుందని అన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని సిఎఫ్‌లు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు ధనలక్ష్మి, నాగమ్మ, తేజ పాల్గొన్నారు.

పాడి పశువులకు బీమా

ఆమదాలవలస : పాడి పశువులు ఎటువంటి కారణం చేతనైనా మరణిస్తే చనిపోయిన పశువులకు నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించనట్లు పశు సహాయ సంచాలకులు డాక్టర్ రోణంకి ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల బీమా కోసం అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు దారునికి 80 శాతం, పింక్ కార్డుదారునికి 50 శాతం రాయితీతో బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడి పశువు ఖరీదు బట్టి రూ.15 వేలు నుంచి రూ. లక్షా 20 వేలు వరకు బీమా చేసుకోవచ్చునన్నారు. పశువు చెవికి ఇన్స్యూరెన్సు ట్యాగ్ నెంబర్‌తో కూడిన బిల్ల వేస్తారని, ఇన్స్యూరెన్సు ప్రీమియంలో 20 శాతం తెల్లరేషన్ కార్డుదారుడు, 50 శాతం గులాబీ కార్డుదారుడు చెల్లించాలన్నారు. దీంతో పాటు జిఎస్‌టి ట్యాక్స్ ఎ3.539 శాతం ప్రీమియంతో పాటు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల హర్షం

ఇచ్ఛాపురం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధ్యాయుల బదిలీల చట్టంలో పురపాలక ఉపాధ్యాయులనూ చేర్చడంపై వివిధ పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల కాలంగా పురపాలక ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న సాధారణ బదిలీలకు అవకాశం దొరకడంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పురపాలక ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసే ప్రక్రియలో విడుదల చేసిన జిఒను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ధర్మాన భాస్కరరావు, ఎచ్ఎం పి.వి.రమణమ్మ, కె.గగన కుమారి, దామోదర్, హెచ్ఎం వై.లత, రాజగోపాల్, రాంప్రసాద్, సాయికృష్ణ పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌పై అవగాహన

ఇచ్ఛాపురం : 2025- 26 యాన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌పై ఎపిఎం ప్రసాదరావు ఆధ్వర్యాన విఒఎలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆరు స్వయం శక్తి సంఘాల నుంచి ఒక ఎక్టివ్ ఎన్యూమరేటర్‌ని గుర్తించి మహిళల కుటుంబ ఆదాయం, జీవనోపాధులు, ఆర్థిక స్థితి వివరాలు మొబైల్ యాప్ ద్వారా సేకరించాలన్నారు. హోంకంపోస్టు, కిచెన్ గార్డెన్, స్వచ్ఛాంధ్రా తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సమావేశం స్త్రీనిధి మేనేజర్ కె.రాము, డి.లక్ష్మి, డి.మోహనరావు, అకౌంటెంట్ మోహిని పాల్గొన్నారు.

జాతరకు నిధులు ఎందుకు వెచ్చించాలి?

నిలదీసిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి- పలాస

ఇటీవల పలాసలో నిర్వహించిన జామి ఎల్లమ్మ జాతరకు మున్సిపల్ నిధులు ఎందుకు వెచ్చించాలని, జాతర కమిటీ పేరుతో దౌర్జన్య కమిటీ వేసుకొని యాత్రికుల నుంచి రూ.లక్షలు వసూళ్లు చేశారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్, సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, పప్పల ప్రసాదరావు, గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్ మాట్లాడుతూ ఎల్లమ్మ జాతరకు గుర్తింపు లేని కమిటీ వేసుకొని భారీగా యాత్రికుల నుంచి డబ్బులు వసూళ్లు చేశారని అన్నారు. అధికారికంగా 80 వేల మంది యాత్రికులు దర్శించుకోగా, వారి వద్ద నుంచి ఎంత వసూళ్లయిందో భహిరంగ రహస్యమని అన్నారు. అటువంటప్పుడు మున్సిపాలిటి ఎందుకు యాత్రకు ఖర్చు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. అజెండాలో 2, 3, 4 అంశాల్లో ఎల్లమ్మ జాతరకు రూ.3 లక్షల వరకూ ఖర్చు చేసినట్లు చెబుతున్నారని, అంత ఖర్చు ఎందుకు పెట్టారు, ఎక్కడ ఖర్చు చేశారో సమాధానం ఇవ్వాలని పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ ఎన్.రామారావు వివరణ ఇస్తూ... ఎల్లమ్మ జాతర రాష్ట్రస్థాయి పండగ మాదిరిగా నిర్వహించామని అన్నారు. యాత్రికులకు ప్రసాదరాలతో పాటు నగర సుందరీకరణకు విద్యుత్ దీపాలతో అలంకరించామన్నారు. కౌన్సిలర్ పప్పుల ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ప్రొక్లెయినర్లతో వార్డుల్లో ఎక్కడ పనిచేయకపోయినా రోజుకు 100 లీటర్ల ఆయిల్ ఏలా ఖర్చు అవుతుందని ప్రశ్నించారు. ప్రొక్లెయినర్ అవసరమని అడిగితే అధికారులు లేదని సమాధానం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో తాగునీరు కోసం ఇష్టానుసారంగా ప్రణాళికలు వేయడంపై కౌన్సిలర్ దుర్గా శంకర్ పండా ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొరగా ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తే వార్డుల్లో ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఏలా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి మేరకు ఉద్దానం రక్షిత తాగునీటి పథకం పలాస-కాశీబుగ్గకు రావడం శుభపరిణామని కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. ఉద్దానం నీటితో వేసవి నీటిఎద్దడి లేకుండా ఉంటుందని, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పూర్తయ్యే వరకు పురప్రజల దాహార్తి తీరుతుందని అన్నారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ వేసవి నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. అంతకుముందు మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించి ఆమోదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డిక్కల ఆనంద్, జ్యోతి నాయక్, శార్వాణి గీత, సనపల సింహాచలం, బెల్లాల శ్రీనివాసరావు, సవర సోమేశ్వరరావు, డిఇ కనకరాజు, ఎఇ కిరణ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దువ్వాడ శ్రీకాంత్

రక్త నిల్వలకు దాతల సహకారం అవసరం

శ్రీకాకుళం అర్బన్ : వేసవిలో రోగ గ్రస్తులకు రక్తం అవసరం ఎక్కువగా ఉంటుందని, తలసేమియా, సికెల్ సెల్ రోగులతో పాటు అత్యవసరాలకు సకాలంలో రక్తం అందించడానికి దాతల సహకారం ఎంతో అవసరమని నెహ్రూ యువక కేంద్రం డిడి వెంకట్ ఉజ్వల్ అన్నారు. శనివారం నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యాన వీల్‌మార్ట్స్, పద్మ పూజిత ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో మేనేజింగ్ డైరక్టర్ బండారు ఫణికుమార్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల రక్త నిల్వలు అవసరం ఉంటుందన్నారు. ప్రధానంగా తలసేమియా సికెల్ సెల్‌తో పాటు దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ఈ సమయంలో రక్తం అవసరమ న్నారు. వ్యాపార దృక్పదంతో పని చేస్తున్న సంస్థలు సామాజిక బాధ్యతగా రక్తదానం చేయడం శుభ పరిణామమన్నారు. ఈ శిబిరంలో 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సంస్థ క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎ.కృష్ణ, ఐతం వెంకటేష్, జి.ఆనంద్, యు.రవి, పి.భాస్కర్, ఆర్.కృష్ణ, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, పెంకి చైతన్య కుమార్, ఉమా శంకర్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. రక్తదాతలకు మెమోంటోలతో పాటు సర్టిఫికెట్లును అందజేశారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

పర్లాకిమిడి : పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కాశీనగర్ బ్లాక్ వెటర్నరీ వైద్యాధికారి గణేష్‌చంద్ర మహంతి అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ పట్టణ రామ మందిరం ఆవరణలో కాశీనగర్ సమితి పశువైద్య శాఖ అధికారులు పశువ్యాధులపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి పశువులను కొనుగోలు చేసేటప్పుడు అవి ఆరోగ్యంగా ఉన్నాయా? లేవా? తెలుసుకొని కొనుగోలు చేయాలని సూచించారు. కొత్తగా కొనుగోలు చేసిన పశువులను ప్రత్యేక ప్రదేశాల్లో ఉంచాలని రైతులకు సూచించారు. అప్పటికే తమ వద్ద ఉన్న పశువులతో కలపకూడదని అన్నారు. సీజన్ మారుతున్న ప్రతిసారీ తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయాలన్నారు. పశు వైద్యాధికారులు తమరావు చక్రధర్, నాగేశ్వరరావు, రైతులు కటికి నీలకంఠం, కటికి లక్ష్మణరావు, శ్రీను, అన్నాబత్తుల గోవిందరావు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడీల శిక్షణ

ప్రజాశక్తి- పొందూరు

పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి తగిన పౌష్టికాహారాన్ని అందించాలని ఐసిడిఎస్ పిఒ ఎస్.అనూరాధ పేర్కొన్నారు. మండలం లోలుగులో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఫోషణ భి పడాయి భి శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల కొలతలను సక్రమంగా చేపట్టాలని, రికార్డుల నిర్వాహణను సక్రమంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.వి.రత్నం, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పిల్లలకు పోషకాహారంతో పాటు మెరుగైన విద్యను అందించాలని దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సిహెచ్ మాధురి అన్నారు. పోషణ బి పడాయి చివరి రోజు శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయ్, లీలారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పిల్లలకు పరిపూర్ణమైన పోషణ అందించడం ద్వారా శారీరక మానసిక వికాసం అభివృద్ధి చెందుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కె.పార్వతి అన్నారు. వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషన్ బి పడాయి బి మూడు రోజులు శిక్షణ కార్యక్రమం ముగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0-6 సంవత్సరాల పిల్లల వయసు చాలా కీలకమైనదని అన్నారు. పరిపూర్ణమైన పోషణ, పఠనం అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు తరకేశ్వర్ పండా, సూపర్‌వైజర్ ధనలక్ష్మి, లత, గంగమ్మ, సరస్వతి, జయమ్మ పాల్గొన్నారు.

పొందూరు : మాట్లాడుతున్న సిడిపిఒ అనూరాధ

ఇచ్ఛాపురం : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లోని 257 అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో ఐదు ప్రధాన అంశాలపై ఇచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ పి.నాగరాణి, సూపర్‌వైజర్ పి.సుజాత, ఎస్.నీలవేణి, పి.పల్లవి, పి.పుష్పలత, జె.లక్ష్మి, జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ బేబీ

నాటుసారా అరికట్టేందుకు చర్యలు

కంచిలి : గ్రామస్థాయిలో నాటుసారా పూర్తిగా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సోంపేట ఎక్సైజ్ సిఐ కె.బేబీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా తయారీ, రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. గ్రామస్థాయిలో నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటుసారాను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుమలరావు, తహశీల్దార్ రమేష్‌కుమార్, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రణస్థలం: జీరో టిల్లేజ్ మొక్కజొన్న పంటలో సకాలంలో కలుపు యాజమాన్యం చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కాకినాడ జిల్లా పెద్దాపురం ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ పథక విభాగం సస్య విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.సుజాత అన్నారు. శనివారం మండలంలోని వెంకటరావుపేటలో జీరోటిల్లేజ్ మొక్కజొన్న పంటలో కలుపు నివారణపై ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు, మొక్కజొన్న పరిశోధన సమన్వయ పథక విభాగం ప్రతినిధి హాఫీజా పర్వీన్, అభ్యుదయ రైతు కలిశెట్టి ఆదినారాయణ, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది ఆర్.దేవుడుబాబు, పి.తవిటినాయుడు, బి.లక్ష్మీనరసింహమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు